

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## మరలా డంపింగ్ యార్డ్‌గా మారిన ఆయుర్వేద వైద్యశాల



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త** : కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న ఆయుర్వేద వైద్యశాల గత సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన ఆయుర్వేద వైద్యసేవలు అందించింది. ప్రస్తుతం గత పదేళ్లుగా ఈ వైద్యశాలలో ఉన్న ఆయుర్వేద వైద్య బృందం కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఆయుర్వేద వైద్యశాల నూతన భవన నిర్మాణం చేపట్టాలని గత పదేళ్లుగా సంబంధిత ఆయుర్వేద వైద్యాధికారులు భావిస్తున్నా నేటికి అవి కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. ఫలితంగా ఈ ఆయుర్వేద భవనాన్ని చుట్టుపక్కల ప్రజలు చెత్తా చెదారాలు వేసే డంపింగ్ యార్డ్‌గా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆయుర్వేద వైద్యాధికారులు స్పందించి ఈ ప్రాంతాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణం కలిగి ఉండాలి

**- పోర్ట్ సీఈవో వెల్లడి**




**ముత్తుకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త** ప్రతి విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణం కలిగి ఉండాలని నాయకత్వం అనేది ఒక పదవి కాదని అది ఒక ప్రభావశీల భాధ్యత అని అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ అన్నారు. ఆదివారం అదానీ వరల్డ్ స్కూల్‌లో నిర్వహించిన విద్యార్థి విభాగాల నాయకుల పదవీ ప్రమాణ స్వీకార వేడుకలు నిర్వహించారు అందులో భాగంగా భాగంగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు ఇతరులను ఉద్దేశించి, దినివీ తన సతీమణి చాందిని పటేల్‌తో కలిసి విద్యార్థి నాయకులకు బ్యాడ్జ్‌లను ప్రదానం చేసి, అధికారికంగా నాయకత్వ పదవులకు నియమితులైన విద్యార్థులకు ప్రమాణ స్వీకారం చేశారు. అదానీ ఫౌండేషన్ అకడమిక్ మేనేజర్ విరాజ్ వోరా మాట్లాడుతూ ఈ వేడుక ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒక ముఖ్యమైన మైలురాయిని తద్వారా విద్యార్థి నాయకులు తమ నేతృత్వంలోని పాఠశాలను మరియు విద్యార్థులను మరింత ముందుకు తీసుకు వెళ్ళాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనందుకు అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ సీఈవోకు అకడమిక్ మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు. అతి సామాన్య స్థితి నుండి ప్రస్తుత స్థానానికి ఆయన చేసిన అద్భుతమైన ప్రయాణం కృషి, పట్టుదల మరియు అంకితభావానికి నిదర్శనమని ఆమె అన్నారు.




## తెలుగు సినిమాల ఖ్యాతిని పెంచిన నటుడు బాలకృష్ణ

### నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి



**నెల్లూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త-వైద్యం :** తెలుగు చలనచిత్ర ఖ్యాతిని జాతీయస్థాయికి తీసుకెళ్లిన నటుడు నందమూరి బాలకృష్ణ అని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఉత్తమ తెలుగు సినిమా కేటగిరీలో బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరికి జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ స్థాయి నటులు బాలకృష్ణ అని అయన అన్నారు. వయస్సు పెరిగే కొద్ది బాలకృష్ణ యువకుడిగా మారిపోతున్నారని కోటంరెడ్డి అన్నారు. జాతీయ అవార్డు రావడంతో నర్తకి సెంటర్లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర రాజకీయాలను సమూలంగా మార్చింది ఎన్టీఆర్ అయితే.. చలన చిత్ర రంగాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన ఘనత బాలకృష్ణకి దక్కుతుందన్నారు.. బసవతారకం హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు మంచి వైద్యాన్ని అందిస్తున్న బాలకృష్ణ.. కళామతల్లి కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నారని వెల్లడించారు. ప్రత్యక్ష రాజకీయాలలోకి దిగి మూడుసార్లు ఎమ్మెల్యే అయిన ఏకైక సినీ నటుడు బాలకృష్ణ అంటూ ప్రశంసించారు. రాజధాని లో కూడా క్యాన్సర్ హాస్పిటల్ స్థాపించేందుకు బాలకృష్ణ ప్రయత్నాలు చేస్తున్నారని.. త్వరలోనే హాస్పటల్ నిర్మాణం జరుగుతుందని కోటంరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తనను నమ్ముకున్న వాళ్లు, అభిమానులు ప్రజలు బాగుండాలని నిరంతరం కోరుకునే బాలకృష్ణ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోటంరెడ్డి ఆకాంక్షి ంచారు. బాలకృష్ణతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం తన పూర్వజన్మలో చేసుకున్న అదృష్టం అన్నారు. దేహంలో ఊపిరి ఉన్నంతవరకు బాలకృష్ణ వెంటే నడుస్తానని ఈ సందర్భంగా కోటంరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.



## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 12483క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 34.970టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 100,ఎన్ఎఫ్‌సికి 370, పెన్నా డెల్టాకు2750, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 92.930మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# అవయవ దానం ఎందరో జీవితాల్లో వెలుగులు

**- ప్రతి ఒక్కరికి అవయవదానంపై అవగాహన అవసరం - జిల్లా కలెక్టర్ ఆనంద్ - ఘనంగా జాతీయ అవయవదాన దినోత్సవం**





**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త** ప్రజల ప్రాణాలను కాపాడే మహత్తరమైన శక్తి అవయవదానానికే ఉందని, అవయవదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కస్తూర్బ కళాక్షేత్రంలో కార్పొరేట్ వైద్యశాలలు, ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ఆనంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని కలెక్టర్, కమిషనర్, వైద్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అవయవదానంపై అవగాహన చాలా తక్కువగా ఉందని, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపే ఈ గొప్ప కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, వైద్యులు కూడా తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. నెల్లూరు ప్రధాన ప్రభుత్వ వైద్యశాలలో ప్రతిరోజు కూడా సుమారు 1000 మంది రోగులు వస్తుంటారని, వీరందరికీ అవయవదానంపై అవగాహన కల్పించేందుకు హాస్పిటల్ వైద్యులు, మెడికల్ కళాశాల వైద్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఒకరి అవయవ దానం పది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని, అపోహలు వీడి అవయవ దానం గొప్పతనం తెలుసుకొని ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తొలుత విశాఖపట్నం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్యులు రాంబాబు అవయవ దాన ప్రాధాన్యతను, అవయవ దానం చేసే ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థి దశ నుంచే అవయవదానంపై కల్పించాలని, భారతదేశంలో ప్రతి సంవత్సరం ఐదు లక్షల మంది అవయవాల కొరతతో చనిపోతున్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ప్రతి ఒక్కరు కూడా జీవన్ థాన్ ఆన్లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ మహత్తర కార్యక్రమంలో పదిమంది ప్రాణాలు నిలబెట్టేందుకు ముందుకు రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఒక అవయవ దానం అంటే ఒక వ్యక్తి, వారి సమ్మతితో, వారి అవయవాలను చట్టబద్ధంగా తొలగించి మరొక వ్యక్తికి మార్పిడి చేయడానికి అనుమతించే ప్రక్రియ, ఇక్కడ దాత జీవించి ఉండవచ్చు లేదా చనిపోయి ఉండవచ్చు దగ్గర బంధువు కావచ్చని వివరించారు. అవయవ దానం అనేది స్వచ్ఛందంగా ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగే ప్రక్రియ అని, దళారులు మాటలు విని మోసపోవద్దని డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. అనంతరం జ్యోతి అనే మహిళ బ్రెయిన్ డెడ్‌తో మరణించగా ఆమె అవయవాలను దానం చేసి పలువురు జీవితాల్లో వెలుగులు నింపిన ఆమె భర్త వెంకటరమణను కలెక్టర్, వైద్యులు ఘనంగా సత్కరించారు. ఇదే స్ఫూర్తి పదిమందిలో కలగాలని వారు సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డిఎం అండ్ హెచ్వో సుజాత, వైద్యులు మాధవి, రాజేశ్వరి, శ్రీరామ్ సతీష్, దొరసానమ్మ, సతీష్, రంజిత్, నర్సింగ్ విద్యార్థులు, ఆసుపత్రుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో అత్యున్నత గౌరవం గురువల సోంతం : ఎమ్మెల్యే



**కావలిరూరల్, ఆగష్టు3ప్రభాతవార్త** సమాజంలో అత్యున్నత గౌరవం గురువల సోంతమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి తెలిపారు. ఆదివారం కావలి ఫెన్సనర్స్ భవనంలో బిటిఎ 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గోన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల గోప్పతనాన్ని చక్కగా వివరించారు. ఉపాద్యాయులైన వారు జీవితానికి అంకురం వంటి వారని, విద్యార్థుల జీవితాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దగలవారిని కోనియాడారు. గత ప్రభుత్వంలో టీచర్లు జీతాల కోసం ఎదురు చూసే వారని, నేడు 1వ తేదినే జీతాలు అందుకుంటున్నారన్నారు. టీచర్లకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖమంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారనికోనియాడారు. బిటిఎ ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ బీటిఎ సంఘం రాష్టంలో ఒక బలమైన సంఘంగా, అంతే కాకుండా తెలంగాణాలోను బీటిఎ సంఘం ఒక మహా శక్తిగా ఎదుగుతుందని తెలిపారు. ఒక మహిళను రాష్ట ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఘనత బీటిఎకు దక్కుతుందన్నారు. రాష్టంలో అనేక జిల్లాలో సంఘం బలోపేతానికి రాష్ట శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా ఆధ్యక్షుడు మణి సుబ్బు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, రాష్ట అసోషియేట్ అధ్యక్షులు పల్లం వేణుగోపాల్, కోశాధికారి పి. అధినారాయణ, వర్కింగ్ ప్రసిడెంట్ ముసలయ్య, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, పి. లక్ష్మయ్య, కట్టా రమేష్, ఎ.భాస్కర్, వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, సోమశిల ప్రాజెక్ట్ మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధు బాబు నాయుడు, రాష్ట కార్యదర్శులు, జిల్లా నాయకులు, అన్ని డివజన్‌లలోని మండలాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గోన్నారు.

## ఇష్టపడి చదవండి విజయం మీదే

**- ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ**



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త** క్రమశిక్షణే విజయానికి పునాది అని సోషల్ మీడియా మాయలో పడవద్దని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని లైలా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిద్దార్థా జూనియర్ కాలేజి ప్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు క్రమశిక్షణతో చదువుకోవడం ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవచ్చునని ఆమె విద్యార్థిని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల మాయలో పడి చదువును నిర్లక్ష్యం చేయవద్దని విద్యార్థులకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఇష్టపడి చదవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ఆమె స్టూడెంట్స్‌కు హితోపదేశం చేశారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని సహవిద్యార్థులతో స్నేహబావంతో మెలగాలన్నారు. పెద్దల పట్ల గౌరవం ,చిన్నల పట్ల ప్రేమ సమాజం పట్ల బాద్యతగా మెలగాలని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో ముందుకు వెళ్ళాలని అన్నారు. ఈసందర్భంగా కళాశాల బాలికలు ఆమెకు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్స్ సాగర్, రామకృష్ణా, అద్యాపక బృందం, విద్యార్థులు పాల్గోన్నారు.



## 12 గంటల్లో దొంగను పట్టుకున్న వేదాయపాలెం పోలీసులు



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాసి అమాయకులైన వినియోగదారుల ఏటీఎం కార్డులను తస్కరించి నగదు స్వాహా చేసే నిందితుడిని వేదాయపాలెం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కేసు నమోదైన 12 గంటల్లోగా నిందితుడిని పోలీసులు పట్టుకోవడం విశేషం. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకి చెందిన ముప్పరాజు సురేంద్ర ఏటీఎం కేంద్రాల వద్ద తచ్చాడుతూ నగదు విత్ డ్రా చేసుకోవడానికి ఇబ్బందులు పడే వారిని టార్గెట్‌గా చేసుకొని తాను సహాయపడుతున్నట్లు నటించి వారు ఏటీఎం కార్డులను దొంగలించేవాడు. వారి చేతిలో పనికిరాని ఏటీఎం కార్డులను ఉంచేవాడు. వెంటనే వేరే ఏటీఎం వద్దకు వెళ్లి వారు ఏటీఎం కార్డులతో నగదు స్వాహా చేసేవాడు. ఇదే క్రమంలో శనివారం స్థానిక నిప్పు సెంటర్లో ఉన్న ఓ బ్యాంకు ఎటిఎం వద్దకు వైయస్సార్ నగర్‌కు చెందిన రామాపురం వెంకటేష్ అనే వ్యక్తి నగదు విత్ డ్రా చేసుకునేందుకు వచ్చాడు. అప్పటికే అక్కడ ఉన్న సురేంద్ర నగదు తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వెంకటేష్ కు సహాయం చేస్తున్నట్లుగా నటించి అతని బ్యాంకు బాలన్స్ తెలుసుకున్నాడు. వెంటనే పనికిరాని కార్డును అతని చేతిలో పెట్టి తనకు వేరే పని ఉందంటూ వెళ్ళిపోయాడు. తర్వాత వెంకటేష్ అసలు విషయం గ్రహించి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన వేదాయపాలెం విజయ్ కే శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితున్ని గుర్తించి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిప్పు సెంటర్ సమీపంలోని మరో ఏటీఎం సెంటర్ వద్ద తచ్చాడుతున్న సురేంద్రను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 7 ఏటీఎం కార్డులు, రూ. 1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కావలి, గిద్దలూరు, పొదిలి, నాలి తదితర ప్రాంతాల్లో కేసులు నమోదై ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు నవీన్, సాయి కళ్యాణ్ లను జిల్లా ఎస్పీ, నగర డీఎస్పీలు ప్రత్యేకంగా అభినందించారు.

## శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట





**కలిగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త;** కలిగిరి మండలం ఎరుకుల రెడ్డిపాళెంలో ఆదివారం శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. దాత ప్రముఖ రియలిష్టు గ్రామానికి చెందిన షేక్ ఖాజామస్తాన్ ,నూర్ జహాన్ కుటుం బం, గ్రామస్తుల సహకారంతో జరిగినఈ విగ్రహ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ హాజరైనారు. తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి గ్రామస్తులు, విగ్రహదాత వెంటరాగా ఆగమ పండితులు పూర్ణకుభంతో ఎమ్మెల్యేకి స్వాగతం పలి కారు. అనంతరం స్వామివారి కార్యక్రమంలో పాల్గొన్న కాకర్ల స్వామివారి దీవెనలు అందుకున్నారు. అనంతరం అభిక్షేకాలు, దాన్యా దివాసం,క్షిరాదివాసం తదితర కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యేకి పౌరోహితులు,తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ చిన్న గ్రామమైనా పురిటి గడ్డమద ఉన్న మమకారంతో ఇంత మంచి కార్యక్రమం తలపెట్టిన దాత ఖాజామస్తాన్ దంపతులు, గ్రామస్తుల సహకారంతో స్వామివారి విగ్రహం ప్రతిష్ట జరగడం ఎంతో ఆనంద దాయకమన్నారు. గ్రామస్తులంతా కలసి కట్టుగా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా ప్రశించ దగ్గ విషయమన్నారు. ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టకు స్థలము అందజేసిన కీర్తిశేషులు తోకల పెద్దసుబ్బయ్య, చిన్నమ్మ కుమారులు వారి సంతానానికి తమ హృదయ పూర్వక అబినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు బిజ్జం క్రిష్ణారెడ్డి, చీమల తాతయ్య, జనార్ధన రెడ్డి, మస్తాన్‌రెడ్డి , గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కండలేరు వరద కాలువకు నీటి విడుదల





**అనంతసాగరం, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయం నుంచి కండలేరు వరద కాలువకు ఆదివారం 3వేల క్యూసెక్కుల నీటిని సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి , సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఇ బి.వెంకటరమణారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాస్‌కుమార్‌లు విడుదల చేశారు. తొలుత గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో రెండు రికార్డులు సాధించామని గర్వంగా ఉందని ఆత్మకూరు నియోజకవర్గం శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ- ధర్మాదాయ శాఖామంత్రి సూచనలతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించామన్నారు. ఎన్నడూ లేని విధంగా ఆగస్ట్ 3న సోమశిల జలాశయం నుంచి కండలేరు వరద కాలువకు నీటిని విడుదల చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ రెండు రికార్డులు సాధించడం పట్ల ప్రాజెక్ట్ చైర్మెన్‌గా తనకు గర్వంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో కలు వాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, తెలుగుగంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌రవీంద్రప్రసాద్, ఉత్తర కాలువ నీటి సంఘం అధ్యక్షులు డి.పెంచలప్రసాద్‌నాయుడు , టిడిపి నాయకులు, ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

# వరకట్న నిషేదాన్ని పటిష్టంగా అమలు చేయాలి



**కావలిరూరల్, ఆగష్టు3ప్రభాతవార్త :** రాష్టంలో వరకట్న నిషేద చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని లోక్ అదాలత్ సభ్యుడు మాల కోండా రెడ్డి కోరారు. పౌర సమాజంలో వరకట్న నిషేద చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఆదర్శవంమైన వివాహ వ్యవస్థను నిర్మించాలని ఆయన కోరారు. ఎంతో మంది మహిళా ఉద్యమ కారులు పోరాడి సాధించుకున్న వరకట్న నిషేద చట్టం 1961లో పార్లమెంట్‌లో ఆమోదం పొందడం జరిగిందన్నారు. ఈ చట్టం అమలు చేయడంలో ఆలసత్వం,నిర్లక్ష్యం కనపడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరకట్నాలు ఇవ్వడం, తీసుకోవడం నేరమన్నారు. దీనికి జైలు శిక్ష, జరిమానా వుంటాయని తెలిపారు. ప్రతి వివాహాన్ని వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రక్షణ కలిగి బహుభార్యత్వాన్ని నివారించడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. పౌర సంస్థలు, మహిళా సంఘాలు వరకట్న నిషేద చట్టంపై ప్రజల్లో చైతన్యాన్ని కల్పించాలని కోరారు.

## మీరు ఎప్పటికి మారుతారు



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేడీలుగా, అనుమానతులుగా, నేరస్తులుగా రికార్డుల కెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సమాజంలో కలిసిపోవాలని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా మీరు మారితేనే మీ బతుకులు మెరుగుపడతాయన్నారు. ఎంతకాలం ఈ విధంగా రౌడీలుగా, కేడీలుగా ఉంటారని, తమ తీరు మార్చుకుని బుద్ధిగా మలుచుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## అదనపు లోడ్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, ఆగస్టు3 ప్రభాతవార్త :** గృహ విద్యుత్ వినియోగదారులకు 50 శాతం రాయితీతో అదనపు లోడ్ పెంచుకునే అవకాశాన్ని ట్రాన్స్‌కో శాఖ కల్పించిందని , దీనిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ రమేష్ చౌదరి తెలిపారు. కోవూరులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియోగదారులు తాము వాడుకుంటున్న అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి మరలా 50 శాతం రాయితీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆగస్టు 1వ తేది నుంచి డిసెంబర్ 31వ తేది వరకు ఈ సబ్సిడీ రాయితీ అమలులో ఉంటుందని దీనిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ప్రస్తుతం 1 కిలో వాట్ అదనపు లోడ్ ఉంటే 2 వేలు రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని,ప్రస్తుతం ఇచ్చిన ఈ పథకం కింద వెయ్యి రూపాయలు కడితే సరిపోతుందన్నారు. గతంలో ఎప్పుడో పాత విద్యుత్ కనెక్షన్లు తీసుకున్న వారికి విద్యుత్ వినియోగం అప్పటితో పోలిస్తే ప్రస్తుతం అదనపు లోడ్ ఉంటుందన్నారు. ప్రస్తుతం తనిఖీల సమయంలో విజిలెన్స్ అధికారులు అధిక లోడ్ ఉన్నట్లు గుర్తించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ వినియోగదారులు ముందుకు వచ్చి సర్వీస్‌ను క్రమబద్ధీకరించుకునేలా డెవలప్‌మెంట్ చార్జీలో ఇచ్చిన 50 శాతం రాయితీని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## కండలేరులో 26.019 టీయంసీల నీటిమట్టం




**కండలేరుడ్యాం(రాపూరు),ఆగష్టు3ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయం నాటికి జళాశయంలో 26.019 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1860 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 90 క్యూసెక్కులు,చోప్పున మొత్తం 1950 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## అంకమ్మతల్లి దర్శనానానికి పెద్ద ఎత్తున భక్తులు



**రాపూరు, ఆగష్టు 3, ప్రభాతవార్త** మండలంలోని వెపినాపి గ్రామ దేవతైన పోతుకోండ అంకమ్మ తల్లి దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అంకమ్మ కోండకు చేరుకున్నారు. భక్తులు భక్తితో ప్రార్ధిస్తే కోరిన కోరికలు నేరవేర్చే కల్పవల్లిగా వీరాజిల్లుతున్న అంకమ్మ తల్లిని దర్శించుకునేందుకు రాపూరు మండలం నుండే కాక జిల్లాలోని ఇతర మండలాల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ అర్చక స్వాములు అమ్మవారి తీర్ధ ప్రసాదాలను ఆందజేశారు.

## కరంట్ ఆఫీస్ వద్ద రేపటి ధర్నాను జయప్రదం చేయండి



**కావలిరూరల్, ఆగష్టు3ప్రభాతవార్త :** వామపక్ష పార్టీల పిలుపు మేరకు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యలయం వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలందరూ పాల్గోని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. పుల్లారెడ్డి నగర్ లోని కె.ఆర్.ఎస్ గోల్డ్ హోమ్స్ లో మరియు మరికోన్ని అపార్టమెంట్స్ లో ఆదివారం వామపక్ష నాయకులు పర్యటించి స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారుప. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నాయకుడు డి. దర్గా బాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మా రెడ్డి గార్లు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు విధానం తీసుకోని వచ్చిన ఇళ్ళకు, షాపులలకు అపార్ట్‌మెంట్‌లకు బిగించి ప్రజల వద్ద నుండి కరెంటు ఛార్టీల పేరుతో ఎక్కువ డబ్బులు గుంజి ఆదానికి లాభాలు చేకూర్చే పనిలో వుందన్నారు. ఈ మీటర్ల వల్ల ప్రజలపై వేల రూపాయిల భారం పడుతుందన్నారు. ఇప్పటికే కరంటు ఛార్టీల భారం ప్రజలపై రూ. 16 వేల కోట్లు పడిందని, పెరిగిన బిల్లులు కట్టలేక ప్రజలు సతమతమైతున్నారన్నారు. ఇప్పుడు మరలా స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రభుత్వం ప్రజలపై అధిక భారం మోపడం ఎంత వరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ప్రతి పక్షంలో వున్న సమయంలో కరంటు ఛార్జీలు పెంచబోమని చెప్పి మరలా,మరలా ఛార్జీలు పెంచడం ఎంటన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే విదానాన్ని మానుకోవాలని , ట్రూ ఆఫ్ సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిన కరెంటు ఛార్జీలు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు మధుసూధన్ రావు, సిపిఐ నాయకులు నరసింహం తదితరులున్నారు.


## రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

**బిట్రగుంట ఆగస్టు 3 ప్రభాతవార్త :** కావలి జీఆర్పి పోలీస్ స్టేషన్ పరిధిలో పడుగుపాడు కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నెంబర్ 184 28-30 పోస్టుల మధ్య దిగులైన్లో వెలుచున్న ట్రైన్ నెంబర్ 22606 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకను గమనించి. సుమారు 25 సంవత్సరముల వయసు కలిగిన మగ వ్యక్తి రైలు కిందపడి ఆదివారం ఆత్మహత్య చేసుకోవడం జరిగినదని జీఆర్ పి పోలీస్ లు తెలిపారు. మృతుడు క్రికెట్ టీం కి సంబంధించిన నలుపు ములుగు రంగుల టీ షర్టు ఈ టీ షర్ట్ పై సూపర్ స్ట్రైకర్స్ అను టీం పేరు, నెంబర్ 12 మరియు చోటు అను పేరు ఉందని నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడా న్నారు. కేసును కావలి జి ఆర్ పి ఎస్ ఐ కే వెంకట్రావు దర్యాప్తు చేస్తున్నారు.

## నవరత్నాలతో ప్రతి గడపక్కు సంక్షేమం అందించిన ఘనత వైసీపీ దే

**-ఎంపీపీ పెన్నా కృష్ణ**

**- పైద్దపవనిలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం**




**లింగసముద్రం (కందుకూరు) ఆగష్ట్ 3,ప్రభాతవార్త:** గత ఐదేళ్లలో నవరత్నాల కార్యక్రమాలతో ప్రతి ఇంటికి సంక్షేమ మందే విధంగా జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగిందని మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పెదపవని గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ రీకాలింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమం అమలులో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇష్టారీతిన ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు నాయుడు మోసాలని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని క్యూఆర్ కోడ్ తో ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ షఫీ, సర్పంచ్ లు వంటెల శ్రీనివాసులు,మంద కొండయ్య, నాయకులు వంకలపాటి వెంకటేశ్వర్లు,గారపాటి మహేంద్ర,షేక్ రసూల్,రసూల్ అహ్మద్,మంద రవి,కమలాకర్ రెడ్డి,కన్నె రాజారావు,కన్నె రంగయ్య,ప్రభాకర్,ఇంతోటి మాల్యాద్రి, యారమాల రాజా,వట్టిగుంట వెంకటేశ్వర్లు,మల్లిబోయిన వెంకటేశ్వర్లు,బొల్లినేని మల్లికార్జున,ప్రభాకర్ రెడ్డి, ఫయాజ్,జాఫర్, జానీ, ముజీర్, నజీర్, సంసిద్, సబ్బిర్,సయ్యద్ సిరాజ్, మాభాష,షేక్ ఆలీ,షేక్ నాయర్, తదితరులు పాల్గొన్నారు

## బ్రహ్మదేవం నారాయణ బ్రాంచ్ ను సందర్శించిన వి బి ఆర్



**నెల్లూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త-విద్య :** నారాయణ విద్యా సంస్థల సంస్థల జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం బ్రహ్మదేవం లోని నారాయణ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రాంగణంలోని అన్ని విభాగాలను క్లాస్ రూమ్ లను,హాస్టల్ గదులను, సెంట్రల్ కిచెన్ మరియు ఆటస్థలం ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం కళాశాల ఎంజిఎం, అకడమిక్ డీన్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఏవో మరియు సిబ్బందితో సమావేశమై అకడమిక్ పరంగా మంచి ఫలితాల సాధన కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు..విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలి, వారు భవిష్యత్ లో ఉన్నత స్థాయిలో ఉండాలంటే మన వైపు నుండి వాళ్లని ఎలా ప్రోత్సహించాలి అలాగే విద్యార్థుల తల్లితండ్రులతో ఎప్పటికప్పుడు వారి చదువు గురించి తెలియచేస్తూ అలాగే అడాప్షన్ కాలింగ్ గురించి వివరిస్తూ, విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు అలాగే సైన్స్ ల్యాబ్ , కంప్యూటర్ ల్యాబ్ లను పరిశీలించి పలు సూచనలు ఇవ్వడం జరిగింది.

## కూడిపూడి కళాక్షేత్రాన్ని ప్రారంభించిన ఎస్ఐ శివరాకేష్



**మనుబోలు ఆగస్టు 3 ప్రభాతవార్త :** మనుబోలులో కూచిపూడి కళాక్షేత్రాన్ని ఎస్ఐ శివరాకేష్ ఆదివారం నాడు ప్రారంబించారు. ఈ సందర్బంగా ఎస్ఐ మాట్లాడుతు మనుబోలు గ్రామంలో ఇలాంటి కళాక్షేత్రాలు ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. నేటి తరం బాలికలకు మన సాంప్రదాయలను కళలను పద్ధతులను నేర్పించడం శుభపరిణామం అన్నారు. మండల వ్యాప్తంగా బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నాట్య గురువులు సాంబశివరావు మాట్లాడుతు నా శిష్యురాలు చేత కూచిపూడి కళాక్షేత్రంను ప్రారంబించడం అదృష్టంగా భావిస్తున్నాం అన్నారు. నాట్యాచారిని పృద్వీ పూర్ణిమశ్రీ ఆద్వర్యంలో మండల వ్యాప్తంగా బాలికలు పాల్గోని శిక్షణ పొందుతారని ఆశిస్తున్నామని అన్నారు. కూచిపూడి నాట్యం ప్రభుత్వ కోర్సులైన సర్టిఫికేట్లు డిప్లమా కోర్సులు నేర్పించ బడునని అన్నారు. మన భారతీయ కళలను గ్రామీణ స్దాయిలో అందరికి తెలియాలని ఆశయంతో ఈ కళాక్షేత్రాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో దాసరి బాస్కర్ గౌడ్ బొమ్మిరెడ్డి ,హరిగోపాల్‌రెడ్డి, సాని వెంకట రమణయ్య, ముంగర రవీంద్రరెడ్డి, చేరెడ్డి పద్మనాభరెడ్డి, మల్లికార్జున,కుడుముల వెంకటరమణయ్యగౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## ఆటోవాలాల ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీఐ



**ఉదయగిరి, ఆగష్టు 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పోలీసు సర్కిల్ పరిధిలోని ఆటో వాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ వెంకటరావు ఎస్సై ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ ఉదయగిరి సర్కిల్ కార్యాలయంలో ఆటో వాలాలతో సమావేశం నిర్వహించారు. ఆటో వాలాలు వాహనానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సామర్ధ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఆటోలో ఎక్కి ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహారించాలన్నారు. అలాగే వాహనం నడిపేటప్పుడు సెల్ ఫోన్లు మాట్లాడరాదన్నారు. అలాగే ముందు సీట్లో ప్రయాణికుల్ని కూర్చోబెట్టరాదన్నారు. వాహనం నడిపేటప్పుడు ముందు వెనుక సైడు చూసుకుని నడపాలి అన్నారు. ఆటో వాలాలకు సూచనలు, సలహాలు ఇస్తూ సమావేశం నిర్వహించారు.

## అన్నదాత సుఖీభవ రైతులకు వరం: లీగల్ సెల్ అధ్యక్షులు



**ఉదయగిరి, ఆగష్టు 3, ప్రభాతవార్త :** సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అందించిన అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వరం అని రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నాయకులు సందిరెడ్డి రామారావు అన్నారు. ఈ కార్యక్రమం శాసనసభ్యులు కాకల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు 13,500 మాత్రమే ఇవ్వడం జరిగిందని, చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వంలో రైతులకు మూడు విడతలుగా సంవత్సరానికి 20 వేల రూపాయలు మంజూరు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని లీగల్ సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు అన్నారు. ఈ రాష్ట్రంలో 49 లక్షల రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. రైతుల సంక్షేమానికి రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని కొనగోలు చేసిన ధాన్యానికి వెంటనే బకాయిలు లేకుండా పైకం చెల్లించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని లీగల్ సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు అన్నారు.

## సుంకర అంజమ్మ మృతి దిగ్బాంతికి గురిచేసింది




**కావలి రూరల్,ఆగష్టు 3 ప్రభాతవార్త :** కావలి పట్టణ వైఎస్సాఆర్‌సిపి సీనియర్ నాయకులు సుంకర దయాకర్ రెడ్డి మాతృమూర్తి సుంకర అంజమ్మ మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసినట్లు కావలి మాజీ ఏమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. అంజమ్మ మృతి పట్ల ఆదివారం మాజీ ఎమ్మెల్యే రామి రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆమె మరణం తనను భాదించిందని ఈ విపత్కర పరిస్థితులలో దేవుడు ఆ కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాందిచాలని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

## పోలీస్ కస్టడీకి కాకాణి

**నెల్లూరు క్రైమ్, ఆగష్టు 3, ప్రభాతవార్త :** వెంకటాచల మండలంలోని భూ రికార్డులు తారుమారు చేసిన కేసులో సిట్ అధికార బృందం న్యాయస్థానం ఆదేశాల మేరకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ఆదివారం కస్టడీలోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో రిమాండ్ ఖైదీగా ఉన్న కాకాణిని సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకొని విచారణ నిమిత్తం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడ సాయంత్రం వరకు అధికారుల బృందం కాకాణిని అన్ని కోణాల్లో విచారించారు. రికార్డులు తారుమారు చేయడం వెనక ఏఏ అధికారుల సహకారం ఉందని, అందుకు గల కారణాలపై అనేక ప్రశ్నలు సంధించారు. విచారణ సమయంలో కాకాణి వెంట అయన న్యాయవాది ఉన్నారు.

# దూదేకులసంఘ మండల అధ్యక్షుడిగ షేక్ పీరయ్య



**వరికుంటపాడు, ఆగష్టు3, ప్రభాతవర్త :** మండల దూదేకులసంఘ అధ్యక్షుడిగ షేక్ మీరయ్యను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీమ్ తెలిపాడు. ఆదివారం స్థానిక మండల కేంద్రంలో దూదేకులసంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్బంగ జిల్లా అధ్యక్షుడు షేక్ సలీమ్ మాట్లాడుతు రాష్టంలో షుమారు 20 లక్షలకు పైగ దూదేకులు వుండగ ప్రభుత్వం మాత్రం నాలుగున్నర లక్షలు మాత్రమే వున్నట్లు చూపించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని అన్నారు. 2026లో జనగణనతోపాటు కులగణనను నిర్వహించి లెక్కలు తేల్చాలని కోరారు. అధికారులు జనగణనకోసం ఇంటి వద్దకు వచ్చినపుడు ఇండియన్ ఇస్లామ్ దూదేకుల కులంగ నమోదు చేసుకోవాలని సూసించారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగ దూదేకుల కులస్తులను గుర్తించి వారిని చైతన్య పరచేందుకు గడప, గడప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో దూదేకులకు పోటీచేసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ప్రకటించి వున్నారనిఅందులో పదవులను బర్తీచేసి నిదులు కేటాయించాలని కోరారు. ఈసందర్బంగ నూతనంగ ఎన్నికైన మండలకమిటి అధ్యక్షుడు షేక్ మీరయ్య మాట్లాడుతు తనపై నమ్మకముంచి పదవి అప్పగించిన వారికి కృతగ్నతలు తెలియజేశారు. తమ కులస్తులకు నిత్యం అందుబాటులోవుండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాద్దయ్య, ఉదయగిరిమండలాద్యక్షుడు అల్లాభాష, నాయకులు షెక్ మస్తాన్, షరీఫ్, నాగూర్‌మీ రావలి, షేక్ అమీన్, ఖాసీమ్‌భీ, సైదాబాను, తదితరులు పాల్గొన్నారు.

# కావలిలో సుంకర అంజమ్మ 142 వ నేత్రదానం



**కావలిరూరల్, ఆగష్టు 3 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని రాజీవ్ నగర్‌లో నివాసముంటున్న పట్టణ వైసిపి నాయకుడు సుంకర దయాకర్ మాతృ మూర్తి సుంకర అంజమ్మ(82), నేత్రాలను వారి కుటుంబ సభ్యులు రెడ్ క్రాస్‌కు ఆందజేశారు. ఆమె చివరి కోరిక మేరకు ఆమె నేత్రాలను కావలి రెడ్ క్రాస్ సహకరాంతో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నిషియన్ సునీల్ సేకరించారు. ఈ సందర్భంగా వైసిపి నేత దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తన తల్లి నేత్ర మరియు అవయవ దానాల పట్ల పూర్తి అవగహన కలిగి వుండేవారన్నారు. సుమారు20 సంవత్సరాల క్రింతమే ఆమె కావలి రెడ్ క్రాస్‌కు నేత్రదాన ప్రతిజ్ఞ పత్రాన్ని ఆందజేశారన్నారు. అంతర్జాతియ అవయవ దానం రోజున ఆమె నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపు కల్పించడం తమకు ఆనందం కల్గిస్తుందన్నారు. జిల్లా రెడ్ క్రాస్ పాలకమండలి కలికి శ్రీహరి రెడ్డి, కావలి రెడ్ క్రాస్ ఛైర్మన్ డి. రవి ప్రకాష్; ,జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరనాధ్‌లు దయాకర్ రెడ్డికి ప్రశాంసా పత్రాన్ని బహుకరించారు. కావలి రెడ్ క్రాస్ ద్వారా ఇది 142వ నేత్రదానమని వారు తెలిపారు. కావలి రెడ్ క్రాస్ నేత్రదాన విభాగం ఇన్‌చార్జ్ ఇలింద్ర వాణి దయాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ధన్య వాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు, పూర్వ ఎబివీపి కార్యకర్తలు, నేత్రదాత సుంకర అంజమ్మ బౌతిక కాయానికి నివాళు లర్పించారు.

# గడప గడపకూ దూదేకుల కార్యక్రమం ప్రారంభం : జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్



**నెల్లూరు సిటీ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** జిల్లా లో ఉన్న అన్ని గ్రామాలలో ఉన్న దూదేకుల కులస్తుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి నెల్లూరు జిల్లాకు సరిహద్దు ప్రాంతమైన వరికుంటపాడు గ్రామం నుండి దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీమ్, దూదేకుల గడప గడప ప్రోగ్రామ్‌ను స్థానిక దూదేకుల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది దూదేకుల కులస్తులు ఉన్నప్పటికీ , ప్రభుత్వ లెక్కల ప్రకారం 4,52,000 మంది మాత్రమే దూదేకుల కులస్తులు ఉన్నారని 2011 జనాభా లెక్కలు చెపుతున్నారు. ఇందువలన మనం మన యొక్క హక్కులను కాపాడుకోవడానికి , రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 2026 మార్చి నుండి జన గణనతో పాటు కుల గణన ప్రక్రియ చేపడుతున్నారు. ఈ సందర్భంగా జనాభా లెక్కల కోసం అధికారులు మన ఇంటి వద్దకు వచ్చినప్పుడు మనం మన కులాన్ని ఇండియన్ ఇస్లాం దూదేకులగా నమోదు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో మనల్ని బీసీఈగా నమోదు చేసే అవకాశం ఉంది. ఇందుకోసం నెల్లూరు జిల్లాలో ఉన్న దూదేకుల కులస్తులను గుర్తించి వారిని చైతన్య పరచడానికి గడప గడపకు కార్యక్రమం మొదలు పెట్టడం జరిగింది. అంతే కాకుండా జిల్లాలో ఉన్న దూదేకుల ఇంటి వద్దకు వెళ్లి వారికి ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం మరియు ప్రజా ప్రతినిధులు కలిసి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుంది. స్థానిక సంస్థలలో దూదేకుల కులస్తులు అధికం గా ఉన్న ప్రాంతాలలో మాకు సర్పంచ్‌లుగా, వార్డ్ మెంబర్‌లుగా, కో ఆప్షన్ సభ్యులుగా, మున్సిపాలిటీ లలో కార్పొరేటర్‌లుగా అవకాశం ఇవ్వాలని , ఈ విషయాన్ని స్థానికంగా ఉన్న నాయకులను, శాసన సభ్యులను కలసి దూదేకులకు అవకాశం ఇవ్వాలని కోరడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ప్రకటించి ఉన్నారు. దూదేకుల కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి, చైర్మన్ / డైరెక్టర్‌లను నియమించాలని, నామినేటెడ్ పదవులులలో దూదేకులకు జనాభా ప్రాతిపదికన పదవులు ఇవ్వాలని కోరారు. వరికుంటపాడు మండల కమిటీ అధ్యక్షులుగా షేక్ పీరయ్యని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, వరికుంటపాడు మండల అధ్యక్షులు షేక్ పీరయ్య, రాష్ట్ర కార్యదర్శి సిద్దయ్య, యూత్ నాయకులు షేక్ మస్తాన్ (అగ్ని ), షరీఫ్, మహమ్మద్, ఉదయగిరి మండల అధ్యక్షులు షేక్ అల్లా భాషా, నాగుల్ మీరా వలి, షేక్ అమీన్, ఖాసింబీ, సైదా భాను, స్థానిక దూదేకుల సోదరులు పాల్గొన్నారు.

# బిసి హాస్టల్‌లో క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్

### చెత్తను ఎత్తిన డివిజన్ అధికారి కిష్టయ్య





**బుచ్చి ఆగస్టు 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం లో బిసి-1 బాలుర హాస్టల్‌లో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈకార్యక్రమాంలో ఎబిసిడబ్ల్యూ ఐ కిష్టయ్య పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన కొద్ది సేపు విద్యార్థులకు వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత,పరిశరాల పరిశుభ్రత ఉంటే మనం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన వార్డన్ రమణయ్య, నాల్గోతరగతి సిబ్బంది అందరు కలిసి హాస్టల్‌లో,బయట పరిసరాలలో వున్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎబిసిడబ్ల్యూ కిష్టయ్య మాట్లాడుతు ప్రభుత్వం బిసి వసతి గృహాల విద్యార్థులకు అద్భుతమైన మెను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ప్రతి 2 వ శనివారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే మూడు నెలల కొకసారి పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగష్టు 6,7,8 తేదిలలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో ప్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1-4-2025 నుండి విద్యార్థులకు వారి యొక్క ఆహార బిల్లులను ఎఫ్ఆర్ఎస్ కు అనుసంధానం చేసి బిల్లులు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. దీని వలన రాష్ట్రంలో ఉన్న బిసి వసతి గృహలాలో అవినీతి రహిత వసతి గృహాలుగా తయారు అయ్యాయని తెలిపారు. పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయన పేర్కున్నారు . ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని చదివిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా హాస్టల్ స్టాకు ను ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు . విద్యార్థులకు మెను ఎలా పెడుతున్నారు తెలుసుకొని,ఆహారాన్ని రుచి చూసి సంక్షేమాధికారి రమణయ్యను అభినందించారు,ఈకార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గోన్నారు.

## ఏటూరులో రెండు ఇండ్లలో చోరి

**చేజర్ల ఆగష్టు 3 ప్రభాతవార్త** చేజర్ల మండలం ఏటూరు గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున నిద్రిస్తున్న మహిళల మెడ నుండి రెండు బంగారు గొలుసులను దొంగలు అపహరించారు. ఈ సంఘటన పై చేజర్ల ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏటూరు గ్రామంలో ఉట్లపల్లి శ్రీదేవి అనే మహిళ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి మెడలో ఉన్నటు వంటి 3 సవర్ల బంగారు గొలుసును అపహరించారు. అలాగే పరుచూరి రజిని ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో రెండు సవర్ల బంగారు గొలుసును చోరి చేశారు.గ్రామంలో ఒకరాత్రి రెండు చోరీలు జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురైయ్యారు. ఈవిషయాన్ని చేజర్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చేజర్ల ఎస్ఐ గ్రామంలో చోరి జరిగిన గృహాలను బాధిత మహిళలను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు పోలీస్ విచారణకు మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్

**కోవూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :** మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ నేడు పోలీస్ విచారణకు హాజరుకానున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో అనిల్‌కుమార్ యాదవ్ పై విచారణ కొనసాగుతోంది.ఇంతకు ముందు ఈ నెల 26న కోవూరు సర్కిల్ కార్యాలయానికి హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఆ రోజు విచారణకు హాజరుకాలేదని అనిల్‌కుమార్ యాదవ్ తెలియజేశారు. దాంతో పోలీసులు మళ్లీ 30న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని మరోసారి నోటీసులు ఇచ్చారు. అయితే గత నెల 31న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు బందోబస్తు డ్యూటీలో పాల్గొనాల్సి రావడంతో విచారణను పోలీస్ లే వాయిదా వేశారు.తాజాగా, ఆగస్టు 4వ తేదీ ఉదయం కోవూరు సర్కిల్ కార్యాలయానికి విచారణకు హాజరుకావాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రేపు మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది.

## మద్యం మత్తులో తోటి స్నేహితుడు పై దాడి

**కొడవలూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మండలం గండవరం గ్రామానికి చెందిన షేక్ షఫీ అనే వ్యక్తిని తోటి స్నేహితుడుని గాయపరిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్నేహితుడుని దారుణంగా మద్యం బాటిల్ పగలకొట్టి కడుపులో పొడిచిన సంఘటన నార్త్ రాజుపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడ్ని 108 సిబ్బంది ద్వారా నెల్లూరు ప్రైవేట్ వైద్యశాల మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ కోటిరెడ్డి తెలిపారు.

## ఫైనాన్స్ కంపెనీ వేదింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త** ఫైనాన్స్ కంపెనీ వేదింపులు భరించలేక బుచ్చిరెడ్డిపాళెం మండలం కట్టుబడిపాళెం హరిజనవాడకు చెందినచిన్నమస్తానయ్య ఉరివేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తమ మృతికి ఫైనాన్స్ కంపెనీ వేదింపులేకారణమని సూసైడ్ నోటు రాశారు. హోమ్ ఫైనాన్స్‌లోను తీసుకొని 4 వాయిదాలు చెల్లించకపోవడంతో వారు ఇంటికి వచ్చి బెదిరింపులు పాలు పడ్డారని మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకుపోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టరంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా ముదురు చిన్నమస్తానయ్య భార్య మంగమ్మ మాట్లాడుతు ఫైనాన్స్ కంపెనీలో ఏడు లక్షలు రుణం తీసుకున్నామని తెలిపారు. నెలకు 14 వేలు రూపాయాలు చొప్పున కడతున్నామన్నారు. రెండు నెలలు వాయిదాలు కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు తమ ఇంటిని వేలం వేస్తున్నట్లు గోడపైన రాయడం జరిగిందని వాపోయారు. దీనికి మనస్తాపం చెందిన తన భర్త ఉరివేసుకొని మృతి చెందాడని ఆమె కన్నీటి పర్యంతమైయ్యారు.

## ప్లాస్టిక్ చెత్తతో నిండిన కాలువ, నీరుచ పారేదెలా ?



**కోవూరు, ఆగస్టు3 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన చెరువు నుంచి గతంలో దుంపల కాలువ ద్వారా వందలాది ఎకరాలు సాగులో ఉండేవి. ప్రస్తుతం మారిన పరిస్థితుల దృష్ట్యా ఈ కాలువ పరిధిలో ఎక్కువ శాతం లేఅవుట్లు వేయడంతో గతంలో పారుదల కాలువగా ఉన్న ఈ దుంపల కాలువ డ్రైన్‌గా మారిపోయింది. చుట్టుపక్కల ప్రజలు ఈ కాలువను డంపింగ్ యార్డ్‌గా వాడుకోవడంతో ఈ పారుదల కాలువ నీరు పోక చెత్తాచెదారాలు, ప్లాస్టిక్‌తో నిండిపోయింది. దీంతో చుట్టుపక్కల వారు ఈ దుర్వాసన భరించలేక ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి కోవూరుకు ప్రధాన కాలువైన ఈ ప్రధాన డ్రైన్‌ను పూడిక తీసేలా దృష్టి పెట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

# ప్రాచీన ఆయుర్వేదానికి మంచి రోజులు





### - ఆయుర్వేదంపై అడుగులు వేస్తున్న ప్రజలు



**కోవూరు, ఆగస్టు3 ప్రభాతవార్త :** ప్రాచీన ఆయుర్వేదానికి తిరిగి పాత పరిస్థితి ప్రారంభం అయింది. ఇప్పటివరకు అలపతి వైద్యంపై దృష్టి సారించిన ప్రజలు మరలా ఆయుర్వేద వైద్యంపై నమ్మకం పెంచుకుంటున్నారు. ఫలితంగా కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలకు ప్రతి రోజూ రోగులు రావడం ప్రారంభ మైంది. కోవూరు మండలం కొత్తూరు రోడ్డులో 1955 లో ఈ ప్రాంతంలో సన్నపురెడ్డి శేషరెడ్డి సహకారంతో ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దాదాపు 50 సంవత్సరాల పైగా ఈ ప్రాంతంలో ఆయుర్వేద వైద్యసేవలు మెండుగాలందాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అనేక మంది ప్రజలు ఈ ఆయుర్వేద వైద్యసేవలు పొందేవారు. ఈ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులు, నర్సు, కాంపౌండర్, అటెండర్ కూడా ఉండడంతో ఈవైద్యశాలకు మంచి పేరు కూడా వచ్చిం ది.అనంతరం ఈ ఆయుర్వేద వైద్యశాల మరమ్మతులకు గురి కావడంతో దీనిని గత 10 సంవత్స రాల క్రితం సామాజిక ఆరోగ్య కేంద్రంలోకి మార్చారు.

**- అందుబాటులో ఆయుర్వేద వైద్యసేవలు**

కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్యశాలలో ఈ సంవత్సర కాలంలో ఆయుర్వేద మందులు విరివిగా వచ్చాయి. దీనికి తోడు ఈ వైద్యశాలలో పనిచేస్తున్న ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్ ప్రజల్లో ఆయుర్వేదంపై అవగాహన కల్పించేందుకు కోవూరు, కొడవలూరు మండలాల్లో అనేక అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేశారు. దీనికి తోడు కరోనా సమయంలో ఆయుర్వేదంలో ఉన్న మందులు బాగా పనిచేయడంతో ఆయుర్వేదంపై ప్రజల్లో మరలా గురి ఏర్పడింది. ఎన్నో రకాల రోగాలను నయం చేసే మందులు ఆయుర్వేదంలో ఉండడంతో ఈ వైద్యశాలకు రోగుల తాకిడి ప్రారంభం అయింది. అన్ని రకాల వైద్యసేవలతో పాటు మందులు కూడా ఎక్కువగా ఉండడంతో ఈ వైద్యశాల రోగుల తాకిడితో కళకళలాడుతుంది. ప్రస్తుతం ఆయుష్ కింద ఈ ఆయుర్వేద వైద్యశాలకు ఎక్కువగా మందులు రావడంతో ప్రజలు వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు.

**- ఆయుర్వేదం అతి పురాతనమైనది**

ఆయుర్వేదంలో అనేక రకాల జబ్బులు నయం చేసే మందులు ఉన్నాయని, ఇది అతి పునాతనమైనదని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్ తెలిపారు. తమ వైద్యశాలలో బీపీ, షుగర్‌తో పాటు కీళ్ల వాపు , నడుము నొప్పి వంటి అనేక రకాల వ్యాధులు నయం చేసే మందులు ఉన్నాయని, ప్రజలు వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## జిల్లా స్థాయి జూనియర్ చెస్ ఛాంపియన్‌లుగా చక్రధర్, హిమ తేజస్విని




**నెల్లూరు సిటీ, ఆగస్టు 3, ప్రభాతవార్త** 3వ తేది ఆదివారం జిల్లా చెస్ అసోసియేషన్, రాయ్ చెస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన నెల్లూరు జిల్లా స్థాయి అండర్ 19 (జూనియర్) బాలూరు, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలలో యడవల్లి సాయి చక్రధర్, గొద్దేటి హిమా తేజస్విని బాల బాలికల విభాగంలో గెలుపొందారు. బాలుర విభాగంలో కె. సాత్విక్, వి. సుశ్వంత్, సయ్యద్ ఫర్హాన్ బాలికల విభాగంలో బి. కీర్తన, బి. సంజన, కె.ఆరాధ్య వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాలు సాధించారు. ఆగస్ట 8,9 తేదీలలో కర్నూలులో జరుగు రాష్ట్ర స్థాయి జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా నుండి అధికారకంగా ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పోటీలలు గెలుపొందిన క్రీడాకారులకు కళాశాల డైరెక్టర్ గూడూరు లక్ష్మి, ఆనం పద్మనాభ రెడ్డి, బహుమతులు అందజేసారు. ఆర్బిటర్ మౌనిక, విష్ణు, బషీర్, పరిశీలకుడు ఫీడే ఇన్స్‌క్టర్ అజీజ్ పోల్గొన్నారు.

## ఎరుకుల రెడ్డిపాళెంలో సుపరిపాలనలో తొలిఅడుగు



కలిగిరి, **ఆగస్టు 3, ప్రభాతవార్త** ;కలిగిరి మండలంలోని ఎరుకుల రెడ్డిపాళెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యమ్రం నిర్వహించగా ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు, టిడిపినాయకులు, అధికారులు వెంటరాగా ప్రతి గడపకు వెళ్లిన కాకర్ల ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా! చంద్రబాబు పాలనపై మీ స్పందనేంటి. ఇంట్లో చదువుకొనే చిన్నారులు ఉన్నారా. వారికి తల్లికి వందనం డబ్బులు పడ్డాయా. పిల్లలు బాగా చదువుతున్నా అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఏవైనా సమస్యలు ఉన్నా అధికారులు మీ సమస్యలు తీర్చకపోయినా మాదృష్టికి తెస్తే సమస్యలు తీరుస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పి4 విదానం నచ్చి గ్రామానికి చెందిన ప్రముఖ రియలష్టు షేక్ ఖాజామస్తాన్ నూర్‌జహాన్ దంపతులు నాలుగు పేద కుటుంబాలను దత్తత తీసుకుంటానని ముందుకు రావడం ఎంతైనా అభినందించదగ్గ విషయమన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచి మేకల విజయమ్మ, ఖాజామస్తాన్ ,నాయకులు బిజ్జం క్రిష్ణారెడ్డి చీమల తాతయ్య, వడ్లమూడి కొండపనాయుడు, మస్తాన్న రెడ్డి, సచివాలయ శిబ్బంది,పంచాయితీ సెక్రటరీ హరిత ,పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో కండలేరు ఎడమ కాలువకు జలకళ కండలేరు

- జలాశయంలో నీటిమట్టం తగ్గపోవడంతో ఎడమ కాలువలో కొద్ది రోజులుగా ఆగిన ప్రవాహం
- వరిపైర్లు, నిమ్మతోటలతో పాటు పశువులకు తాగునీటి కోసం రైతుల ఇక్కట్లు
- సమస్యను పొదలకూరు మండల టీడీపీ నాయకుల ద్వారా సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన రైతులు



**పొదలకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త** ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో కండలేరు ఎడమ కాలువకు జలకళ కండలేరు, జలాశయంలో నీటిమట్టం తగ్గపోవడంతో ఎడమ కాలువలో కొద్ది రోజులుగా ప్రవాహం ఆగిపోయింది. ఎడమ కాలువ లిఫ్ట్‌కు విద్యుత్ సరఫరాను అందించే ట్రాన్స్ ఫార్మర్ పిడుగుపాటుకు గురవడంతో సాంకేతిక సమస్యలు తలెత్తింది. ఈ సమస్యను ఇటీవల డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో నిధులు మంజూరు చేసిన కలెక్టర్ ఆనంద్ యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు మోటార్లకు సర్వీస్ చేయించిన అధికారులు
ఆదివారం కాలువకు లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు, పొదలకూరు మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డికి నాయకులతో పాటు ఎడమకాలువ రైతులు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పొదలకూరు మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జు నాయుడు, నాయకులు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, దేవినేని శరత్, పులిపాటి వెంకటేశ్వర్లు, ఎత్తపు వెంకట రెడ్డి, వెన్నపూస శ్రీనివాస్ రెడ్డి, మలిరెడ్డి ఓబుల రెడ్డి, రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# అసంపూర్తి భవనాలతో విద్యార్థినుల అవస్థలు

- జిల్లా కలెక్టర్ గారూ.. మీరైనా పట్టించుకోండి
- దుస్థితిలో కోవూరు బీసీ బాలికల వసతి గృహం



**కోవూరు, ఆగస్టు3 ప్రభాతవార్త :** ఒకవైపు ప్రభుత్వం అన్ని వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చి దిద్దాలని చర్యలు చేపడుతున్నా సంబంధిత శాఖ అధికారుల్లో మాత్రం ఆశించిన మేర స్పందన ఉండకపోవడంతో ఫలితంగా విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. కోవూరు నియోజకవర్గానికి మండల కేంద్రమైన కోవూరు బీసీ బాలికల వసతి గృహంలో నెలకొంది. మొత్తం ఈ వసతి గృహంలో 156 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ వసతి గృహానికి కేవలం వం ట గది, ఆఫీస్ రూమ్ పోగా మిగిలిన ఆరు రూము ల్లో ఒక్కొక్క రూములో 20 నుంచి 30 మంది విద్యార్థినులు నిద్రపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా విద్యార్థినులు అవస్థలతో కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఈ బీసీ వసతి గృహానికి ఒక్కొక్క దానికి రూ. 15 లక్షల చొప్పు రెండు మంజూరయ్యాయి. ఈ పనులు పొందిన కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేసి బిల్లులు రాకపోవడంతో సగంలో పనులు ఆపివేసి రెండు సంవత్సరాలు అయింది.ఇందుకు ఆ కాంట్రాక్టర్ చెబుతున్న కారణం.. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తాము ఏం చేయలేమని చెప్పడం గమనార్హం. దీంతో ఈ వసతి గృహంలో విద్యను అభ్యసిస్తున్న విద్యారినులు అవస్థలతోనే కాలం వెల్లదీస్తున్నారు. దీనికి తోడు ఈ వసతి గృహంలో సంబంధిత శాఖ అధికారుల తనిఖీలు కూడా ఆశించిన మేర లేకపోవడంతో ఈ వసతి గృహంలో నెలకొని ఉన్న సమస్యలు తీరే పరిస్థితి కానరాలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి బీసీ బాలికల వసతి గృహంలో నెలకొని ఉన్న సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై సంబంధిత సంక్షేమాధికారి జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లినా నిధుల కొరత కారణంగా ఈ భవనాలు పూర్తి చేయలేక పోయారు. ఫలితంగా ఈ అసంపూర్తి భవనాలనే విద్యార్థులు బట్టలు ఆరవేసుకునే కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనికి కొంతమేర నిధులు విడుదల చేస్తే భనాలు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ఈ రెండు అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించి నిధులు మంజూరు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ రెండు భవనాలు పూర్తయితే విద్యార్థినులకు ఎంతో మేలు ఉంటుందని వారు భావిస్తున్నారు.